సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 7 । మే । 2024



కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన 8లో

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఎన్నికల పరిశీలకుడు వివేకనందన్ పరిశీలించారు.



స్పీడ్ పెంచిన విశ్వేశ్వరరాజు

పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు తనదైన శైలిలో ప్రచారంలో దూసుకుపోతున్నారు.



నేడు అష్టదళ పద్మారాధన

విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

ఘాట్ రోడ్లలో భారీ వాహనాల రాకపోకలు నిషేధం

- ఈనెల 10 నుంచి 14 వరకు అమలు
- జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఘాట్ రోడ్లలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ దృష్ట్యా సిబ్బంది, సామగ్రిని తరలించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రెవెన్యూ, పోలీసు, ఆర్‌అండ్‌బీ శాఖలు ముందస్తు చర్యలు చేపట్టినట్టు ఆమె పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలోని బొడ్డవర నుంచి అనంతగిరి,అరకులోయ మీదుగా పాడేరు జాతీయ రహదారి, వడ్డాది-పాడేరు ఘాట్‌రోడ్డు, లంబసింగి, మారేడుమిల్లి-భద్రాచలం ఘాట్‌రోడ్ల మార్గాల్లో నిషేధం అమల్లో ఉంటుందన్నారు. వాహనదారులంతా ఆయా తేదీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నేడు అల్లూరి శత వర్ధంతి

- నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



మంపలో అల్లూరి విగ్రహం

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతిని మంగళవారం అన్ని చోట్ల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సోమవారం జాతీయ అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. స్మారక ప్రాంతాలైన మంప, రాజేంద్రపాలెం, కృష్ణదేవిపేటతో పాటు ఆయన దాడులు జరిపిన రాజవొమ్మంగి, చింతపల్లి, అడ్డతీగల పోలీసు స్టేషన్ల వద్ద వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

బాధ్యతగా ఎన్నికల విధుల నిర్వహణ



సిబ్బందితో మాట్లాడుతున్న వివేకనందన్

పాడేరు : సార్వత్రిక ఎన్నికల విజయవంతానికి ఉద్యోగులంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని సాధారణ ఎన్నికల పరిశీలకుడు కె.వివేకనందన్ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం రెండో విడత ఎన్నికల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను, పోలింగ్ ప్రక్రియపై రూపొందించిన వీడియోలను పరిశీలించి ఎన్నికల విధులను నిర్వహించాలని సూచించారు. పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల రిటరింగ్ అధికారులు భావన వశిష్ట, వి.అభిషేక్ మాట్లాడుతూ పోలింగ్ శాతాన్ని పెంచేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పాడేరు అసెంబ్లీకి 242 మంది, అరకు అసెంబ్లీకి 230 మంది సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల నియమావళి పక్కాగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఫారం-17సి, మాక్‌పోల్ సర్టిఫికెట్, బ్లాక్ కవర్ సర్టిఫికెట్ నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనీలు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

● గుర్రాలు గతం.. రోడ్లు నిజం

ఇక ఓటేయడం పండగే



ఓటు వేసేందుకు గుర్రాలపై వస్తున్న భూసిపుట్టు ఓటర్లు (ఫైల్)



భూసిపుట్టుకు నిర్మించిన తారురోడ్డు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో భూసిపుట్టు, జామిగుడ, ఇంజిరి, గుల్లెల పంచాయతీ పరిధిలో సుమారు 80 గ్రామాలకు చెందిన సుమారు 6,500 మంది ఓటర్లు పది నుంచి 17 కిలోమీటర్ల దూరంలోని పోలింగ్ కేంద్రాలకు కాలినడకన, గుర్రాలపై వెళ్లి ఓటు వేసేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గిరిజన ప్రాంతాన్ని అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. రోడ్లు, మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ సేవలు చేరువతో పోలింగ్ కేంద్రాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే అవకాశం ఏర్పడింది.

- తప్పిన దూరాభారం
- బాగుపడిన రోడ్లు, అందుబాటులో రవాణా సదుపాయాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లకు చేరువగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ముంచంగిపుట్టు : మావోయిస్టుల పేరు చెబితే అందరికీ గుర్తుకువచ్చేవి ముంచంగిపుట్టు మండలంలో భూసిపుట్టు..పెదబయలు మండలంలో జామిగుడ, ఇంజరి, గుల్లెల.. ఒకప్పుడు ఇక్కడ ఎన్నికల నిర్వహణ అధికారులకు సవాల్‌గా ఉండేది. రోడ్లు, సమాచార వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో అక్కడి విషయాలేవీ బాహ్యప్రపంచానికి తెలిసేవి కావు. ఆ పంచాయతీల పరిధిలోని గ్రామాలపై మావోయిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండేది. 2014 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భూసిపుట్టు పోలింగ్ కేంద్రంలో మావోయిస్టులు బ్యాలెట్ బాక్సులు ఎత్తుకుపోయారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు 2015లో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల సరిహద్దులోని రూడకోటలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుచేశారు. ఈ ప్రాంతానికి సమీపంలో ఒడిశా సరిహద్దులో కూడా ఆ ప్రభుత్వం ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో మావోయిస్టుల కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి.

● ఏవోబీలో రామగూడ వద్ద 2016 అక్టోబర్ 23న జరిగిన ఎన్‌కౌంటర్‌లో అగ్రనేతలతో కూడిన 30 మంది మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. అప్పటినుంచి విస్తృతంగా తనిఖీలు, కూంబింగ్ నిర్వహించడం వల్ల క్రమేపీ మావోయిస్టులు పట్టు కోల్పోయారు.

అభివృద్ధిపై దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. సుమారు రూ.20 కోట్లతో భూసిపుట్టు, జామిగుడ పంచాయతీలకు సుమారు 26 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించింది. మావోయిస్టుల ప్రభావం క్రమేపీ తగ్గుతున్న నేపథ్యంలో పోలీసులు గిరిజనుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టారు. క్రీడాపోటీలు నిర్వహణ, ఉచితంగా క్రీడా సామగ్రి పంపిణీ చేసి యువతను ప్రోత్సహిస్తున్నారు. ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గిరిజనుల కష్ట సుఖాల్లో భాగస్వాములై వారితో మమేకం అవుతున్నారు.

● ముంచంగిపుట్టు నుంచి కుమడ వరకు ఆర్టీసీ సహకారంతో పోలీసులు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు. సుమారు ఆరు పంచాయతీల గిరిజనులు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

● ముంచంగిపుట్టు మండలం భూసిపుట్టు పంచాయతీ పరిధిలో 18 గ్రామాలకు చెందిన 1313 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతో కాలినడకన, గుర్రాలపై 11 కిలోమీటర్ల దూరంలోని కుమడ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసే వారు. ఇప్పుడు వీరందరికీ పంచాయతీ కేంద్రమైన భూసిపుట్టులో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

● జామిగుడ పంచాయతీ పరిధిలో 2011 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా 16 కిలోమీటర్ల దూరంలో ముంచంగిపుట్టు మండలంలోని కుమడ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేవారు. గుర్రాలు, కాలినడకన, ప్రైవేట్ వాహనాల్లో వెళ్లేవారు. ఇప్పుడు వీరు ఐదు కిలోమీటర్ల దూరంలోని భూసిపుట్టులో ఓటే వేసేలా ఎన్నికలు అధికారులు ఏర్పాట్లు చేశారు.

● ఇంజరి పంచాయతీలోని 33 గ్రామాల పరిధిలో 2,500కు పైగా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు గుర్రాలు, కాలినడకన సుమారు 15 కిలోమీటర్ల దూరంలోని పెదబయలు మండలం చీకుపనస పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకునేవారు. ఈ ఎన్నికల్లో పంచాయతీ కేంద్రం ఇంజరిలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు.

● గుల్లెల పంచాయతీ పరిధిలో సుమారు 700 మంది ఓటర్లు ఇక్కడికి ఏడు కిలోమీటర్ల దూరంలోని జంగంపుట్టులోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేవారు. ఇప్పుడు పంచాయతీ కేంద్రం గుల్లెలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుతో అవస్థలు తప్పాయి.

ఇబ్బందులు తీరాయి

భూసిపుట్టులో పోలింగ్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. కుమడ, మద్దలబంద గ్రామాలకు వెళ్లి ఓటు వేయాల్సి వచ్చేది. పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయాలని కోరితే రోడ్డు సమస్యను కారణంగా చూపేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్డు, సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చాయి. ఇప్పుడు భూసిపుట్టు, సరియాపల్లిలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేయడం చాలా సంతోషంగా ఉంది.

– కిల్లో రాజమ్మ, సర్పంచ్, భూసిపట్టు, ముంచంగిపుట్టు మండలం

స్వేచ్ఛగా ఓటేస్తాం

గతంలో మా గ్రామం నుంచి 11 కిలోమీటర్లు గుర్రంపై వెళ్లి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేది. సరియైన రహదారి లేక నానా అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు మా గ్రామానికి పక్కా తారురోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.అధికారులు ఈ సారి జరిగే ఎన్నికలలో పోలింగ్ కేంద్రం మా గ్రామంలో ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఓటు హక్కు మా గ్రామంలో అందరూ స్వేచ్ఛగా వినియోగించుకుంటాం.

– సాధురాం, భూసిపుట్టు, ముంచంగిపుట్టు మండలం

నిర్భయంగా ఓటెయ్యాలి



మారుమూల గిరిజనులకు అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పించింది. ఈ దఫా ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలనుసైతం వారికి చేరువ చేస్తున్నాం. గతంతో పోలిస్తే పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. భూసిపుట్టు, జామిగూడ, ఇంజిరి, గుల్లేల పంచాయతీ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతో పహారా ఏర్పాటుచేశాం.

– కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

నేడు సీఎం జగన్ గాజువాక రాక

- సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్‌లో ఎన్నికల ప్రచార సభ



గాజువాక : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం గాజువాక రానున్నారు. సాయంత్రం 5 గంటలకు పాతగాజువాక జంక్షన్ 60 అడుగుల రోడ్‌లో జరగనున్న ప్రచార సభలో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ కో ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఏర్పాట్లను సోమవారం పర్యవేక్షించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ తదితరులతో కలిసి 60 అడుగుల రోడ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాజువాక నియోజకవర్గంలో ప్రచార సభలో పాల్గొంటున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఈ సభలో పాల్గొనాలని కోరారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీఎం షెడ్యూల్ ఇలా..

బీచ్‌రోడ్డు : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నగరానికి రానున్నారు. మధ్యాహ్నం 12.20 గంటలకు రాజమండ్రి నుంచి విమానం ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు 12.40 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్ ద్వారా శ్రీకాకుళం జిల్లా ఇచ్చాపురం వెళ్తారు. అక్కడ ఎన్నికల ప్రచార సభలో పాల్గొని తిరిగి 4.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో గాజువాక చేరుకొని.. సాయంత్రం 5 గంటలకు ఏర్పాటు చేసిన ప్రచార సభలో పాల్గొంటారు. సభ అనంతరం 6 గంటలకు తిరిగి విశాఖ ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. అక్కడ నుంచి విమానం ద్వారా గన్నవరం బయలుదేరి వెళ్తారు.

శివారు గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం



పెదబయలు: ర్యాలీలో పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు గుమ్మా తనూజారాణి, మత్స్యలింగం



ప్రజలకు అభివాదం చేస్తున్న అభ్యర్థులు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు తనూజారాణి, మత్స్యలింగం

పెదబయలు: ఎన్నడూలేని విధంగా తమ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చిందని అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజారాణి, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. సోమవారం పెదబయలు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీగా ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల కూడలిలో జరిగిన సభలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బాక్సైట్ జీవోను రద్దు చేసి గిరిజనులకు మేలు చేశారన్నారు. జిల్లా పాడేరు కేంద్రంలో వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుచేశారన్నారు. ఇంజరి, జామిగుడ, గిన్నెలకోట, ముంచంగిపుట్టు మండలం భూషిపుట్టు, బుంగాపుట్టు ప్రాంతాల్లో తారు రోడ్ల నిర్మాణం చేపట్టారన్నారు. చంద్రబాబు అమలుకాని వాగ్దానాలతో మేనిఫెస్టోను విడుదల చేశారని, వాటిని ఏ ఒక్కరూ నమ్మి మోసపోవద్దన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి అరకు అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గిరా గిరా తిరుగుతోంది ఫ్యాన్ అంటూ డ్యాన్సులతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు హోరెత్తించాయి. రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా నాయకులు సల్లంగి ఉమామహేశ్వరావు, ఎంపీపీ బొండా వరహాలమ్మ, మండల పార్టీ అధ్యక్షులు వంతాల ఆనందరావు, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మాజీ జెడ్పీటీసీలు జర్సింగి గంగాభవాని, కొంటా సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, మండల నాయకులు గంపరాయి సూరయ్య, కనకరాజు. తమ్మన్న, అనంతరావు,ధనలక్ష్మి, అనిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఆకర్షితులై చేరికలు



టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



టీడీపీ కార్యకర్తలను ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి
- టీడీపీ కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానం

ముంచంగిపుట్టు: టీడీపీ అధిష్ఠానం తీరుతో విసిగిపోయిన ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై తమ పార్టీలో పెద్ద ఎత్తున చేరుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని దొడిపుట్టు పంచాయతీ సింధిపుట్టు, మాకవారం పంచాయతీల్లో టీడీపీకి చెందిన దొడిపుట్టు మాజీ సర్పంచ్ రాంబాబు, నేతలు జీన్ను, శంకరరావు, ముకుంద్ తదితర 38 కుటుంబాలు చేరాయి. ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆధ్వర్యంలో చేరిన వీరికి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలు, పరిపాలన నచ్చి వైఎస్సార్‌సీపీలోకి చేరిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేసే నాయకుడికి మనం అందరం మళ్లీ ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. బీజేపీ తరఫున పోటీచేస్తున్న అరకు అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులు కరోనా వంటి కష్టకాలంలో కనిపించలేదన్నారు. అప్పట్లో వైఎస్సార్ సీపీ నేతలు, జగనన్న ప్రభుత్వం మాత్రమే అండగా ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై వేసి అరకు ఎంపీగా తనూజారాణి, అసెంబ్లీ అభ్యర్థిగా రేగం మత్స్యలింగంను గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావు, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ జగబంధు, జేసీఎస్ మండల కన్వీనర్ కొండలరావు, సర్పంచులు వసంత, గంగాధర్, ఎంపీటీసీ సోయిత పాల్గొన్నారు.

అరకులో టీడీపీ నేతలు, కార్యకర్తలు..

అరకులోయ రూరల్: ప్రజలంతా జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం తెలిపారు. అరకులోయ మండలం బస్కీ పంచాయతీ గాయిబంద, హుకుంపేట మండలం పట్టం పంచాయతీల్లో టీడీపీకి చెందిన వార్డు సభ్యుడు బాలన్న, ఆ పార్టీ కార్యకర్తలు గుండన్న, స్వామి, లింగయ్య, రమేష్, బాలరాజుతోపాటు 62 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మండల కేంద్రంలోని తన స్వగృహంలో మత్స్యలింగం పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నేతలు పూర్ణ,అర్జున్, అప్పలస్వామి, రామారావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

● పోస్టల్ బ్యాలెట్ కోసం బారులు



పాడేరులో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయ సునీత



రంపచోడవరంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం బారులు తీరిన ప్రభుత్వ ఉద్యోగులు



రంపచోడవరంలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ప్రభుత్వ ఉద్యోగులు





అరకులోయి, రంపచోడవరంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారులు అభిషేక్,ప్రశాంత్‌కుమార్

సాక్షి,పాడేరు/రంపచోడవరం/అరకులోయ రూరల్ : జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సోమవారం కూడా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. స్థానిక తలారిసింగి సెంటర్‌లో ఏర్పాటు చేసిన పాడేరు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఎన్నికల కేంద్రాన్ని కలెక్టర్ ఎం.విజయసునీత, అరకులోయ కేంద్రాన్ని ఆర్వో అభిషేక్ సందర్శించారు. జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో సోమవారం ఒక్కరోజే 2915 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారు. పాడేరు అసెంబ్లీకి సంబంధించి సోమవారం 864 మంది ఓట్లు వేయగా ఈ మూడురోజుల్లో 1299 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అరకు అసెంబ్లీకి సంబంధించి 842 మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఈ మూడు రోజుల్లో 1250 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. రంపచోడవరం అసెంబ్లీకి సంబంధించి 4,457 మంది దరఖాస్తు చేసుకోగా సోమవారం ఒక్కరోజు 1209 మంది ఓటు వేశారు. మూడు రోజుల్లో 2,266 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆర్వో ప్రశాంతకుమార్ తెలిపారు.

'పాడేరు'లో మాత్రమే హోం ఓటింగ్

జిల్లాలో పాడేరు నియోజకవర్గంలో మాత్రమే హోం ఓటింగ్ జరిగింది.15 మంది వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఇంతవరకు పాడేరులో హోం ఓటింగ్ వినియోగించుకున్న వారి సంఖ్య 64కు చేరిందని ఎన్నికల అధికారవర్గాలు తెలిపాయి.

చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దు





రోడ్‌షోలో మాట్లాడుతున్న రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ధనలక్ష్మి, బైక్ ర్యాలీ

వై.రామవరం: చంద్రబాబు మోసపూరిత హామీలను మరోసారి నమ్మి మోసపోవద్దని రంపచోడవరం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండల దిగువ ప్రాంతంలోని 17 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా యర్రంరెడ్డిపాలెం, కోట, కె,యర్రగొండ, దాలిపాడు, దేవరమడుగులు, చవిటిదిబ్బలు, పనసలపాలెం, చామగడ్డ, పియర్రగొండ, యార్లగడ్డ, వై.రామవరం పంచాయతీల్లో ఆమె పార్టీ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో భారీస్థాయిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటినీ విస్మరించడం వల్లే ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛను మంజూరుకు ఆ పార్టీనేతలు, జన్మభూమి కమిటీలు, అధికారులకు లంచం ఇవ్వాల్సి వచ్చేదన్నారు. జగనన అవినీతి రహిత పాలన అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్ద అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. జగనన్న అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నిర్వాకం వల్లే రెండు నెలల నుంచి పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతోపాటు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణిని గెలిపించాలని కోరారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, ఎమ్ నారాయణరావు, కంచర్ల విజయ్‌కుమార్, మద్దికొండ భారతిబాబు, బచ్చలి రమేష్, కరణం కనకరాజు, వెదుళ్ల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా : యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన ప్రవీణ్

అనంతగిరి: మండలంలోని మర్ధగుడ సమీపంలోని సోమవారం సాయంత్రం జరిగిన ఆటో బోల్తా పడిన ఘటనలో యువకుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. వంజలవలస గ్రామానికి చెందిన పలువురు పాడేరు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా మర్ధగుడ సమీపంలోని ఆటో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలోని ఆటోలో ఉన్న శెట్టి ప్రవీణ్(24) తీవ్రంగా గాయపడి ఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ దూరియ ఉదయ్‌కిరణ్ తలకు గాయం కాగా, దూరియ రాములమ్మకు చేయి విరిగింది. పలువురు స్వల్పగాయాలతో బయటపడ్డారు.. ప్రమాదంలో గాయపడిన వారిని అనంతగిరి ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి కుటుంబీకులు అనంతగిరి పీహెచ్‌సీ వద్దకు చేరుకుని, కన్నీరుమున్నీరుగా విలపించారు.దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ఎటపాక: మండల పరిధిలోని లక్ష్మీపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నెల్లిపాక గ్రామానికి చెందిన కనుకు నాగవెంకటనర్సయ్య(41) తన ఆటోలో లక్ష్మీపురం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ఆటో అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పార్థసారథి తెలిపారు.

మన నమ్మకం జగనన్నే.. మన భవిష్యత్ వైఎస్సార్‌సీపీతోనే



సంగులోయ గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: వైఎస్సార్‌సీపీని గెలిపించుకొని జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటే సంక్షేమ పథకాలు వలంటీర్లు మన ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలందిస్తారని వైఎస్సార్‌సీపీ పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు చెప్పారు. మండలంలో బొయితిలి,లువ్వాసింగి,నుర్మతి పంచాయతీల్లో వాకపల్లి, పులుసుమామిడి, మద్దిగరువు, కోడిమామిడి, లువ్వాసింగి, సంగులోయ, వంచేబు నిట్టాపుట్టు తదితర గ్రామాల్లో సోమవారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయన మట్లాడుతూ జగనన్నే మన భవిష్యత్ .. వైఎస్సార్‌సీపీతోనే గ్రామా అభివృద్ధి, సంక్షేమం పథకాలు అమలు జరిగాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలన్నీ ప్రజల చెంతకే చేర్చారన్నారు. నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశాన్నారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గబ్బాడి సన్యాసిదొర, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు రాంబాబు, హనుమంతరావు, రాజులమ్మ, గంగరాజు, సుబ్బలమ్మ ,మాలన్న, మాజీ సర్పంచ్ రాంబాబు, మాజీ ఎంపీటీసీ బ్రహ్మలింగం, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగూరుబాబు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు అంద్రయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతుని భార్య ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం



మాచ్‌ఖండ్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ బిశ్వజిత్

ముంచంగిపుట్టు: ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో ఐదేళ్ల క్రితం ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తూ ఒప్పంద కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటనలో నేటికి కుటుంబ సభ్యులకు ఎటువంటి పరిహారం అందలేదు. దీంతో ఇటీవల మృతుడి భార్య జయశ్రీ కొర్రా ప్రాజెక్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో మాచ్‌ఖండ్ యంత్రాంగం కదిలింది. ఈ మేరకు సోమవారం ఒడిశా పరిశ్రమలు, బ్రాయిలర్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బిశ్వజిత్ మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి 2019లో కొర్రా బోనమాళి(28) స్విచ్‌యార్డులో విధులు నిర్వహిస్తూ విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు.కొన్ని నెలలుగా వైద్య సేవలు పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై పూర్తిగా ఆరా తీశారు.ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు.అధికారులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. సంఘటన జరిగిన బయటకు రాకుండా, ఉన్నతాధికారులకు తెలియజేయకపోవడంపై బిశ్వజిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్యతో మాట్లాడి ఆమె తెలిపిన వివరాలను రికార్డు చేశారు. తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ప్రాజెక్టు ఎస్‌ఈ ఎ.వి.సుబ్రమణ్వేశ్వరరావు, ఈఈ జనరల్ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన

- ఎన్నికల పరిశీలకుడు వివేకనందన్

సాక్షి,పాడేరు: స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సోమవారం సాధారణ ఎన్నికల పరిశీలకుడు వివేకనందన్ పరిశీలించారు. అన్ని విభాగాలను తనిఖీ చేసిన నాయన సంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న సిబ్బంది మరో వారం రోజుల పాటు కష్టపడి పనిచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, సీ–విజిల్ ఫిర్యాదులు,బోర్డర్ చెకింగ్ వెబ్‌లైన్, వివిధ అంశాలపై ఆయన అధికారులతో సమీక్షించారు. రికార్డులను పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించడంపై ఆయన అభినందించారు. నోడల్ అధికారులు శివయ్య, సాయి నవీన్, పి.గోవిందరాజులు, పి.రాములు, రమేష్‌కుమార్ రావు, ఎల్‌బీ.వెంకటరావు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి





నెల్లిపాక, అడ్డతీగలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు

ఎటపాక: మండలంలోని నెల్లిపాకలో సీఐ డి.రామారావు, ఎస్‌ఐ పార్థసారథి ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రశాంత ఎన్నికలకు అందరూ సహకరించాలని కోరారు. ప్రతీ ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

అడ్డతీగల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అడ్డతీగల మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు అడ్డతీగల సిఐ ఆర్.రవి కుమార్ తెలిపారు.ఈ మేరకు అడ్డతీగలలో సీఆర్‌పిఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వ్, లా అండ్ ఆర్డర్ పోలీసు విభాగాలతో కలసి అడ్డతీగలలోని పోలీస్ స్టేషన్ నుంచి గాంధీసెంటర్, దేవీసెంటర్ మీదగా సీతపల్లి జెంక్షన్,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ కవాతు నిర్వహించారు. ప్రజలు తమ ఓటు హక్కుని ప్రశాంతమైన వాతావరణంలో వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు సిఐ రవికుమార్ చెప్పారు.

వెల్లివిరిసిన ఆనందం

- ఉచితంగా మూడు చక్రాల వాహనాలు
- దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం
- సజావుగా ప్రయాణం
- ప్రభుత్వ సాయంపై దివ్యాంగుల హర్షాతిరేకాలు



మూడు చక్రాల స్కూటీపై వెళ్తున్న గిరిజనుడు

సాక్షి, పాడేరు: ప్రభుత్వం దివ్యాంగుల అభ్యున్నతి కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దివ్యాంగ విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేందుకు ఎంతో మేలు చేశారు.

వివిధ ఉద్యోగాలకు తమ అంగవైకల్యం అడ్డురాకుండా వారికి మూడు చక్రాల స్కూటీలను అందుబాటులోకి తెచ్చారు. తమలో ఆత్మస్థైర్యాన్ని నింపి తమ సంతోషకరమైన జీవనానికి కృషి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వారంతా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. డిగ్రీతో పాటు ఇతర ఉన్నత చదువులు, ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు చేసే దివ్యాంగ అభ్యర్థులకు రాష్ట వ్యాప్తంగా మూడు చక్రాలతో కూడిన స్కూటీల ఉచిత పంపిణీకి ప్రభుత్వం గత ఏడాది శ్రీకారం చుట్టింది. ఈ మేరకు దివ్యాంగుల సంక్షేమశాఖ ద్వారా వైద్యులు, రవాణాశాఖ, దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటుచేసింది. అర్హులైన దివ్యాంగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి,ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించారు. పాడేరు నియోజకవర్గంలో–ఆరుగురు, అరకు నియోజకవర్గంలో– ఏడుగురు, రంపచోడవరం నియోజకవర్గంలో–17మంది దివ్యాంగ అభ్యర్థులకు మొత్తం 30 స్కూటీలను గత ఏడాది మేలో ఉచితంగా పంపిణీ చేశారు.ఒక్కొక్క స్కూటికి ప్రభుత్వం రూ.లక్షా 10వేలను ఖర్చుపెట్టింది.

మారిన జీవన విధానం

మూడు చక్రాల స్కూటీలను పొందిన దివ్యాంగ విద్యార్థులు, పలువురి ఉద్యోగుల్లో జీవన విధానం మారింది. గతంలో వారు ఎక్కడి వెళ్లాలన్నా మరొకరి సాయంపైనే ఆధారపడేవారు. ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణానికి కూడా వారు ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. అయితే గత ఏడాది నుంచి ప్రభుత్వం ఉచితంగా అందించి మూడు చక్రాల స్కూటీల ద్వారానే తమ ప్రయాణ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఎక్కడికైనా రాకపోకలు సాగించే పరిస్థితితో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఎవరికి భారం కాకుండా ఉత్సాహంగా జీవిస్తున్నారు. ఈ మేరకు వారంతా జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం



వైఎస్సార్‌సీపీలో చేరిన పద్మాపురం పంచాయతీ టీడీపీ నాయకులకు కండువా వేస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం



వైఎస్సార్‌సీపీలో చేరిన అరమ పంచాయతీ దొన్నుదొర అనుచరులకు కండువా వేసి ఆహ్వానిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యలింగం

అరకులోయ రూరల్: ఎన్నికల తరువాత పూర్తిగా టీడీపీ భూస్థాపితం అవ్వడం ఖాయమని అరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు.మండలంలో గత పద్మాపురం పంచాయతీ, డుంబ్రిగుడ మండలం అరమ పంచాయతీ గుమ్మగూడ, పరిడి గ్రామాలకు చెందిన టీడీపీకి చెందిన దొన్నుదొర అనుచరులు, బంధువులు 110 మంది టీడీపీని వీడి సోమవారం అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిలో పద్మాపురానికి చెందిన టీడీపీ నాయకులు జన్ని దాసు నాయుడు, కొర్రి రమేష్, పూజారి దామోదర్, అరమ పంచాయతీ గుమ్మగూడ, పరిడికి చెందిన గెన్ను,శ్రీనివాసరావు, సైతోన్, కృష్ణమూర్తి, రాంబాబుతో పాటు పలువురు ఉన్నారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువా వేసి అరకు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన పలువురు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితులై టీడీపీని వీడినట్టు చెప్పారు. చంద్రబాబు మోసపూరిత ప్రకటనలను ఎవరూ నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరసింహమూర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, నాయకులు శుక్ర, బాలరాజు,అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బంధువులతో సరదాగా ఈతకు వెళ్లి..

- కాలు జారి బావిలో పడి యువకుడి మృతి



మృతుడు చలపాక పాల్ సరోజ్(23)

యలమంచిలి రూరల్: సరదాగా బంధువులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు కాలుజారి బావిలో పడి ప్రాణాలు కోల్పోయాడు. మండలంలోని సోమన్నపాలెంలో ఆదివారం ఈ ఘటన చోటు చేసుకుంది. యలమంచిలి రూరల్ పోలీసులు వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ వద్ద పాత బోయిన్‌పల్లిలో స్వర్ణధామనగర్‌కు చెందిన చలపాక పాల్ సరోజ్(23) రెండ్రోజుల క్రితం కశింకోటలో తన మేనత్త కుమార్తె రజస్వల కార్యక్రమానికి వచ్చాడు. అక్కడి నుంచి వరుసకు సోదరుడైన గౌతంతో యలమంచిలిలో బంధువు తలుపోలు రమణ ఇంటికి వచ్చాడు. రమణ కుమారుడు ప్రణీత్‌తో కలిసి ముగ్గురూ యలమంచిలి మండలం సోమన్నపాలెం వద్ద బావిలో ఈతకు వెళ్లారు. గౌతం, ప్రణీత్ బావిలోకి దిగి ఈత కొడుతున్నారు. వీరిని చూసి ఈత రాకపోయినా పాల్ సరోజ్ బావిలోకి దిగేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడి నీట మునిగాడు. మిగిలిన ఇద్దరూ అతడ్ని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో ఎర్రవరంలో చంద్రగిరి లక్ష్మణ్‌ను పిలిచారు. అతను వచ్చి పాల్ సరోజ్‌ను బయటకు తీసి ఆటోలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు పాల్ సరోజ్ తండ్రి రాజు పాత బోయిన్‌పల్లిలోని ఓ అపార్టుమెంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా, మృతుడు పాల్ సరోజ్ టాటా క్యాపిటల్ ఫైనాన్స్ సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. కుమారుడి మరణ వార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు యలమంచిలి చేరుకుని మృతదేహం వద్ద కుప్పకూలిపోయారు. అయ్యో దేవుడా ఎంత పనిచేశావు అంటూ గుండెలు బాదుకుంటూ రోదించారు. మృతదేహానికి యలమంచిలి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు యలమంచిలి రూరల్ ఎస్సై పైల సింహాచలం సోమవారం రాత్రి తెలిపారు.

సీరియల్ కిల్లర్



హత్య చేసిన నిందితుడు ఉపేంద్ర (ఫైల్)


తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశ ఉన్న యువకులే అతని టార్గెట్.. వారితో స్నేహం చేస్తాడు. కొంత మొత్తం వెచ్చిస్తే దానికి రెండింతలు సంపాదించవచ్చని నమ్మబలుకుతాడు. తీరా నగదు తీసుకువచ్చిన వారిని అదును చూసి అంతమొందిస్తాడు. సాక్ష్యం లేకుండా జాగ్రత్త పడతాడు. ఒక్కడే ఈ కిరాతకానికి పాల్పడతాడు. రెండేళ్ల క్రితమే రెండు హత్య కేసుల్లో జైలుకు వెళ్లి బెయిల్‌పై తిరుగుతున్న ఆ కిల్లర్ మరో రెండు హత్యలు చేసి పోలీసులను సైతం తప్పుదోవ పట్టించి దర్జాగా తిరుగుతున్నాడు. చివరకు గత నెల 29న మరో హత్య చేసి దొరికిపోయాడు. దీంతో లచ్చన్నపాలెం వలంటీర్, మునగపాకలో ఒక యువకుడి హత్యలు వెలుగులోకి వచ్చాయి. దీనికి సంబంధించి నర్సీపట్నం రూరల్ సీఐ హరి సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు..

- డబ్బు కోసం సునాయాసంగా ప్రాణాలు తీస్తున్న కిరాతకుడు
- ఇంటర్ నుంచే హత్యలు మొదలు.. ఇంతవరకు ఐదుగురు హతం
- రెండు కేసుల్లో జైలుకు.. బెయిల్‌పై వచ్చి మరో మూడు హత్యలు
- నిందితుడు ఉపేంద్రను అరెస్టు చేసిన పోలీసులు





హత్యకు గురైన వలంటీర్ హరి (ఫైల్), శివశంకర్ (ఫైల్)



హత్యల వివరాలను వెల్లడిస్తున్న సీఐ హరి, ఎస్‌ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం, మునగపాక: చూసేందుకు స్వచ్ఛంగా.. చలాకీ యువకుడిలా కనిపించే ఆ యువకుడి పేరు పెచ్చెట్టి ఉపేంద్ర (24). వి.మాడుగుల మండలం జంపెన గ్రామానికి చెందిన ఇతడు అచ్యుతాపురం ప్రాంతంలో ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇదే కంపెనీలో పనిచేస్తున్న మండలంలోని జెడ్.గంగవరం గ్రామానికి చెందిన రుత్తల శివశంకర్(25)తో పరిచయం చేసుకున్నాడు. తక్కువ నగదుతో అధిక మొత్తంలో సంపాదించొచ్చని శివశంకర్‌ను నమ్మించాడు. ఫోన్ సైతం వాడకుండా, తను ఇతరులకు ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడ్డాడు. గత నెల 29న జెడ్.గంగవరం గ్రామ శివారుకు రావాలని, లిక్విడ్ గంజాయితో అక్కడకు కొందరు వస్తున్నారని, రూ.2 లక్షల నగదుతో రావాలని శివశంకర్‌కు చెప్పాడు. ఆశతో అక్కడకు వెళ్లిన శివశంకర్‌ను అదను చూసి కర్రతో తలపై కొట్టి హత్య చేసి నగదుతో పరారయ్యాడు. ఈ హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు మూడు టీంలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. ఈ విచారణలో మృతుడితో ఉపేంద్ర సన్నిహితంగా ఉన్నట్టు గుర్తించిన పోలీసులు మండల కేంద్రంలోని బస్టాండు వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో శివశంకర్‌తోపాటు జనవరి 31 రాత్రి హత్యకు గురైన లచ్చన్నపాలెం వలంటీర్ నడింపల్లి హరిని కూడా పింఛన్ల పంపిణీకి తీసుకువచ్చిన రూ. లక్ష నగదు కోసం ఉపేంద్రే హత్య చేసినట్టు బయటపడింది. దీంతో మూడు నెలల అనంతరం హరి హత్య కేసులో మిస్టరీ వీడింది.

ఐదుగురిని హత్య చేసిన ఉపేంద్ర : వ్యసనాలకు అలవాటుపడ్డ ఉపేంద్ర గంజాయి వ్యాపారం ఆశ చూపి నగదు కోసం ఇప్పటికి ఐదుగురిని హత్య చేసినట్టు సీఐ హరి వెల్లడించారు. ఎవరిని హత్య చేసినా కర్రతో తల వెనుక భాగంలో కొట్టి కొట్టి హతమారుస్తాడన్నారు. వలంటీర్ హరిని హత్య చేసి రూ.లక్ష, శివశంకర్‌ను హతమార్చి రూ.2 లక్షలు తీసుకున్నట్టు చెప్పారు. ఇంటర్ చదువుతున్న సమయంలో 2021లో వి.మాడుగుల మండలంలో రెండు హత్యలు చేసి జైలుకు వెళ్లిన ఉపేంద్ర బెయిల్‌పై బయటకు వచ్చాడు. గ్రామస్తులు అతనిని ఇంటి నుంచి గెంటేశారు. దీంతో సమీపంలోని అనకాపల్లిలో అద్దె ఇంటిలో ఉండేవాడు. ఇక్కడ ఉంటూ అచ్యుతాపురం మండల పరిధిలోని లారస్ కంపెనీలో ఉద్యోగం చేసేవాడు. మునగపాక మండలం నాగులాపల్లికి చెందిన యల్లపు మహాలక్ష్మినాయుడితో పరిచయం పెంచుకున్నాడు. రూ.లక్షా 5 వేలు తీసుకువస్తే రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుందని, ఇందుకు మనం చేసేది కేవలం లిక్విడ్ గంజాయి వ్యాపారం అని నమ్మబలికాడు. మహాలక్ష్మినాయుడు నగదును పట్టుకొని 2022 అక్టోబర్ 12న మునగపాక సమీపంలోకి ఉపేంద్ర చెప్పిన స్థలానికి వచ్చాడు. అక్కడ మహాలక్ష్మినాయుడు తల వెనుక భాగంలో ఇనుప రాడ్‌తో బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మహాలక్ష్మినాయుడు వద్ద ఉన్న నగదును తీసుకొని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాడు. అక్కడ నుంచి ఎవరికీ అనుమానం రాకుండా మాకవరపాలెం సమీపంలో అద్దెకు దిగాడు. కొన్ని నెలల తరువాత లచ్చన్నపాలెం, జెడ్.గంగవరంలో హత్యలకు పాల్పడ్డాడు. వలంటీర్ వద్ద రూ.లక్షలో రూ.75 వేలు, శివశంకర్ వద్ద నుంచి పట్టుకుపోయిన రూ.2 లక్షల నగదును ఉపేంద్ర నుంచి రికవరీ చేశామని సీఐ చెప్పారు. ఉపేంద్రను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించామన్నారు. ఈ కేసులను ఛేదించిన సిబ్బందిని అభినందించారు.

ఎన్నో ఏళ్ల పాటు నిరాదరణకు గురైంది..ఎక్కడ చూసినా అసౌకర్యాలు రాజ్యమేలేవి.. ప్రజలు పడుతున్న అవస్థలే కనిపించేవి..శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాలు, పాఠశాలలు, కనీస సౌకర్యాలు లేని ఆస్పత్రులు ఇలా ఒకటేమిటి అన్నింటా దైన్యమే.. ఎన్నాళ్లీ అవస్థలు.. ఎప్పుడు వీటి నుంచి విముక్తి అని మథన పడుతున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ అధికార పగ్గాలు చేపట్టింది.. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నం నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. దీర్ఘకాలిక సమస్యలెన్నింటినో ప్రభుత్వం పరిష్కరించి నర్సీపట్నం ప్రజల మన్ననలు పొందింది. నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్లలో ప్రగతి పరవళ్లు తొక్కుతోంది.


రూ. 10.6 కోట్ల వ్యయంతో విస్తరణ పూర్తయిన నర్సీపట్నం మెయిన్ రోడ్డు

నర్సీపట్నం.. అభివృద్ధికి పట్టం



నర్సీపట్నం: నాలుగు దశాబ్దాలుగా నిరాదరణకు గురై, కనీస స్థాయిలో కూడా అభివృద్ధికి నోచుకోని నర్సీపట్నం నియోజకవర్గం గడచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో పరుగులుతీస్తోంది. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. దీర్ఘకాలికంగా పరిష్కారంకాని సమస్యలెన్నో పరిష్కారమయ్యాయి. పంచాయతీ భవనాలు, ప్రభుత్వ బడులు కార్పొరేట్ హంగులతో చూడముచ్చట గొలుపుతున్నాయి. కనీససౌకర్యాలు లేని ఆస్పత్రుల్లో ఇప్పుడు ఆధునాతన వైద్య పరికరాలతో వైద్యసేవలందిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వం సకల సేవలు అందిస్తోంది. పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లతో గ్రామాలు, వార్డులు కళకళలాడుతున్నాయి. నాలుగున్నరేళ్ల కాలంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధితో పాటు వైఎస్సార్‌సీపీ పారదర్శకపాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లలో నియోజకవర్గంలో నవరత్నాలు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా 3,87,242 లబ్ధిదారులకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా రూ.1,302 కోట్లు ప్రయోజనం చేకూరింది. చాలా ఏళ్ల పాటు నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థికే పట్టం కట్టినప్పటికీ ఎటువంటి అభివృద్ధి జరగలేదు.

అందాల లోగిళ్లు

ప్రతి పేదవాడికి సొంత గూడు ఉండాలని జగనన్న ప్రభుత్వం సంకల్పించింది. ఈ ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలో దాదాపు 4,756 మంది లబ్ధిదారులకు రూ.117 కోట్ల విలుగల భూమిని సేకరించి 72 గజాల చొప్పున ఉచితంగా పంపిణీ చేసింది. ఇంటినిర్మాణానికి రూ.1.85 లక్షల చొప్పున ఆర్థిక సాయంగా అందజేసింది. ఈ ఐదేళ్ల కాలంలో రూ.37.05 కోట్ల వారికి మంజూరు చేసింది. జగనన్నకాలనీలుగా నామకరణం చేసుకుని లబ్ధిదారులంతా తమకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి గృహప్రవేశాలు కూడా చేసుకుంటున్నారు.కాలనీల్లో విద్యుత్, తాగు నీరు, రోడ్లు, కాలువలు నిర్మించారు. వాడుకనీటి సదుపాయం కూడా కల్పించారు.


జగనన్న కాలనీలో అందంగా నిర్మించిన ఇళ్లు

సాగు, తాగు నీరు

2004లో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తాండవ జలాశయం కుడి, ఎడమ కాలువలను రూ.55 కోట్లతో ఆధునీకీకరించారు. నియోజకవర్గంతో పాటు పక్కనే ఉన్న తుని నియోజకవర్గంలోని 53 ఎకరాలకు సాగునీరు అందించారు. 2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాండవ జలాశయం కింద మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు తాండవ ఏలేరు ఎత్తిపోతల పథకానికి రూ.470 కోట్లు కేటాయించారు. నర్సీపట్నం మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం రూ.166.89 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. మున్సిపాలిటీ ప్రజలపై టీడీపీ ప్రభుత్వం మోపిన పన్నుల భారాన్ని ఎన్నికల హామీల్లో భాగంగా 25 శాతానికి తగ్గించి ఊరట కలిగించింది.


మున్సిపాలిటీలో వేస్తున్న భారీ తాగునీటి పథకం పైపులైను

ప్రభుత్వ బడులు నాడు-నేడు


నాడు- నేడులో విద్యార్థులకు సమకూరిన బెంచీలపై కూర్చున్న విద్యార్థులు

నాడునేడు పథకం ద్వారా నియోజకవర్గంలో మొదటి రెండు విడతల్లో 241 పాఠశాలలకు రూ.68.35 కోట్లు కేటాయించారు.

నూతన భవనాలు, అదనపు తరగతి గదులు, ఆధునికవసతులతో కూడిన మరుగుదొడ్లు, రన్నింగ్‌వాటర్, తాగునీరు, మినరల్ వాటర్ ప్లాంట్లు, విద్యార్థుల కోసం డిజిటల్‌క్లాసు రూములు, ప్రహరీలు, క్రీడామైదానాలు, బెంచీలు,పాఠశాలలకు ఆకర్షణీయమైన రంగులు వంటి అభివృద్ధి పనులు చేపట్టారు.

మెడికల్ కళాశాల నిర్మాణం.. ప్రజలకు వరం

మాకరవపాలెం మండలం భీమబోయినపాలెంలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ కళాశాల నియోజకవర్గ ప్రజలకు వరంలా పరిణమించింది.


నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనం

61 సచివాలయాలు... 55 ఆర్బీకేలు


చీడిగుమ్మలలో నిర్మించిన సచివాలయం

సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బాటలు వేసింది. సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించింది. స్వపరిపాలనలో భాగంగా రూ.20.10 కోట్ల వ్యయంతో 61 గ్రామ సచివాలయాలు, రూ.12 కోట్ల వ్యయంతో 55 రైతు భరోసా కేంద్రాలు నిర్మించారు. నర్సీపట్నంలో రూ.75 లక్షలతో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను అన్నదాతల ప్రయోజనార్థం ఏర్పాటు చేశారు. ఇక్కడ నలుగురు సిబ్బంది సేవలందిస్తున్నారు.


రైతు భరోసా కేంద్రంలో కియోస్క్‌లో నమోదు చేసుకుంటున్న రైతు

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో రూ.8.89 కోట్లతో అదనపు భవనాలను నిర్మించారు. మరో రూ.10 లక్షలతో ఎస్‌ఎన్‌సీయూ యూనిట్, రూ.4 కోట్లతో రెండు అర్బన్ హెల్త్‌సెంటర్ల భవనాలను నిర్మించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే.

ఆరోగ్య భద్రతకు పెద్ద పీట


నాతవరంలో నిర్మించిన పీహెచ్‌సీ భవనం

జగనన్న పుణ్యమే..



నాటి టీడీపీ పాలనకు నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు జనం తేడా గమనించారు. అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశాం. పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందించాం. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయి. సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ. 4వేల కోట్లు వెచ్చించాం. ఇంత పెద్ద మొత్తంలో గత టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేయలేదు. మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా ప్రతి పైసా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధికి నోచుకోని ఆర్లిలోవ రహదారి, నర్సీపట్నం మెయిన్ రోడ్డు అభివృద్ధి, మెడికల్ కళాశాల నిర్మాణం చరిత్రలో నిలిచిపోతాయి. ఇదంతా జగనన్న పుణ్యమే.

– పెట్ల ఉమాశంకర్ గణేష్, ఎమ్మెల్యే, నర్సీపట్నం నియోజకవర్గం

పథకం	లబ్ధిదారులు	నగదు (రూ. కోట్లలో)
రైతు భరోసా	42,717	167.5
జగనన్న అమ్మ ఒడి	40,450	148
చేయూత	23,318	127.5
ఆసరా	55,973	158
కాపునేస్తం	1,967	9
వాహన మిత్ర	1,506	5.22
సున్నా వడ్డీ	6,129	12
విద్యా దీవెన	19,192	25
వసతిదీవెన	15,444	11
నాడునేడు పాఠశాలలు	232	68.35
పింఛన్ కానుక	61,411	398
ఆరోగ్యశ్రీ	6,120	30
గృహనిర్మాణం	4,756	117
సున్నా వడ్డీ (పంట రుణాలు)	1,245	1.5
ఈబీసీ నేస్తం	4,205	1.25
చేదోడు	3,124	6.36

ప్రజల ముంగిటకే పాలన

సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువచ్చి గ్రామంలోనే 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని అందుబాటులో ఉంచారు. సమస్యల పరిష్కారం, ధ్రువీకరణపత్రాల కోసం మండల కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే అన్ని పనులు జరిగేలా చర్యలు చేపట్టారు. అవ్వాతాతలు పింఛను తీసుకోవడానికి పడుతున్న ఇబ్బందులు పరిష్కరించేందుకు వలంటీరు వ్యవస్థను అందుబాటులోకి తీసుకు వచ్చి ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను ఇంటికి తీసుకెళ్లి అందించే కార్యక్రమం చేపట్టారు.

తీరిన 'దారి'ద్ర్యం

దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోని నర్సీపట్నం మెయిన్ రోడ్డును రూ.10.60 కోట్లతో 100 అడుగులకు విస్తరించారు. మరో రూ.6 కోట్లతో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పెదబొడ్డేపల్లి డాన్ బాస్కో కళాశాల వరకు చేపట్టిన ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. గొలుగొండ మండలంలో ఆర్లిలోవ అటవీ ప్రాంతంలో అర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణకు ప్రభుత్వం అటవీ అనుమతులు ఇచ్చింది. రూ.3.8 కోట్లతో మూడున్నర కిలో మీటర్ల మేర రోడ్డు విస్తరణ పూర్తయింది.

నెరవేరని అయ్యన్నపాత్రుడు హామీలు

ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నర్సీపట్నం ప్రజలకు అయ్యన్నపాత్రుడు ఒరగబెట్టింది ఏమీ లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ఒక సారి ఎంపీగా, ఆరు సార్లు మంత్రిగా పనిచేసిన ఆయన నర్సీపట్నం ప్రజలకు ఇచ్చిన హామీలను కనీసస్థాయిలో నెరవేర్చలేకపోయారు.

నెరవేరని 'మెయిన్' వాగ్దానం

ప్రధానంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్య, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మెయిన్ రోడ్డు విస్తరణ చేయాల్సిన అవసరం ఉందని మంత్రిగా ఉన్నప్పుడు అయ్యన్నపాత్రుడు చాలా సందర్భాల్లో పేర్కొన్నారు. వంద అడుగుల మేర రోడ్డు విస్తరణ చేపట్టేందుకు ఆర్థిక శాఖ ఆమోదం లభించిందని 2018 జనవరి 2న మంత్రి హోదాలో అయ్యన్న ప్రకటించారు. రోడ్డు విస్తరణకు రూ.160 కోట్లు ఖర్చువుతుందని తెలిపారు. పరిహారం చెల్లించేందుకు 2019 బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయిస్తుందని తెలిపారు. రూ.40 కోట్లు అర్‌అండ్‌బీ శాఖ ద్వారా భవన యజమానులకు నష్ట పరిహారం కింద చెల్లిస్తామని ప్రకటించారు. ఎన్నికలకు ముందే రోడ్డు విస్తరణ జరిగి తీరుతుందని అప్పట్లో స్పష్టం చేసినప్పటికీ నెరవేరలేదు.

'అండర్ గ్రౌండ్'లోకి హామీ

అయ్యన్న పాత్రుడు ఇచ్చిన ముఖ్యమైన హామీల్లో ఒకటైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కూడా కార్యరూపం దాల్చలేదు. సుమారు 65 వేల జనాభా ఉన్న మున్సిపాలిటీలో 130 కిలో మీటర్ల పొడవుతో రూ.77 కోట్లతో పక్కా డ్రైనేజీ ఏర్పాటు చేస్తానని అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. అప్పట్లో ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించినా కార్యరూపం దాల్చలేదు.

'పెద్ద' బూటకం

అయ్యన్నపాత్రుడు ఇచ్చిన మరో ముఖ్యమైన హామీ నర్సీపట్నం పెద్దచెరువును ట్యాంక్ బండ్‌గా తీర్చిద్దడం.ఇది కూడా కార్యరూపం దాల్చలేదు. ట్యాంక్ బండ్ ప్రకటనలకే పరిమితమైంది.

'నీటి'మీద రాతలు

మున్సిపాలిటీ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు రూ.120 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తున్నామని అయ్యన్నపాత్రుడు ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. అనేక హామీలు ఇచ్చినప్పటికీ అయ్యన్నపాత్రుడు ఏ ఒక్కటీ నెరవేర్చలేకపోయారు.

నా ఇల్లు నా చిరునామా

నాకూ సొంతిల్లు ఉంది..



నా పేరు వారాధి కృష్ణవేణి. నేను ఒంటరి మహిళను. మండలంలో రేబాక గ్రామంలో నా తల్లితో జీవించేదాన్ని. ఆమె మరణించడంతో ఒంటరిగానే జీవిస్తున్నాను. నాకు సొంతిల్లు లేని విషయం గ్రహించిన మా వలంటీర్ నాతో దరఖాస్తు చేయించారు. కొన్ని రోజులకు మా గ్రామంలో నిర్మించిన జగనన్న లేఅవుట్‌లో నాకు స్థలం మంజూరైంది. వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాను. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ నాలుగు విడతల్లో నా బ్యాంకు ఖాతాలో ఇంటి నిర్మాణానికి చెందిన పైకం వేశారు. ఇసుక, సిమెంట్, ఇనుముతో కలిపి మొత్తం రూ.1 లక్ష, 80 వేలు అందించారు. ఇంటి పనులు పూర్తి చేసుకున్నాను. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఇంట్లోనే ఉంటున్నాను. నిరుపేదననుకున్న నాకు ఇప్పుడు సొంత ఇల్లుంది. ప్రభుత్వం నన్ను ఇంటి యాజమానురాలిని చేసింది. ఒంటరి మహిళ పింఛను కూడా వస్తుంది. ఇలాంటి ప్రభుత్వాలు ఉంటే నాలాంటి దిక్కు లేని మహిళలు జీవితమంటే భయపడనవసరం లేదు.

నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు


ఓటర్లు	2,06,394
పురుషులు	1,00,407
మహిళలు	1,05.978
ఇతరులు	9
పోలింగ్ కేంద్రాలు	246

ఒడిలో లక్కబొమ్మ...! పరిశ్రమల పట్టుగొమ్మ...!!

దక్షిణ కాశీశ్వరుడు కొలువైన ఊరు...నిరంతర జలధార పంచదార్ల...పక్షుల కిలకిలారావాల ఆవ...ప్రకృతి అందాల తీరం.. ఇదీ యలమంచిలి ముఖచిత్రం. సెజ్ పరిశ్రమల కేంద్రంగా విలసిల్లుతున్న యలమంచిలి నియోజకవర్గం సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని నేవల్ బేస్‌కు కూడా చోటిచ్చి జాతీయ స్థాయిలో ప్రాముఖ్యత పొందింది. ఎంతో రాజకీయ చైతన్యం కలిగిన ఈ నియోజకవర్గం 1952లో ఏర్పాటవగా ఇప్పటి వరకూ 15 సార్లు ఎన్నికలు జరిగాయి 8మంది వివిధ పార్టీల నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.


కొండకర్ల ఆవలో విహరిస్తున్న పర్యాటకులు

- సుందర సాగరతీరం
- ప్రకృతి అందాల ఆవ... సినిమా షూటింగ్‌లకు ప్రసిద్ధం
- ఏటికొప్పాక లక్కబొమ్మకు అంతర్జాతీయ ఖ్యాతి
- నేవల్ బేస్ ఏర్పాటుతో జాతీయస్థాయిలో ప్రాముఖ్యత
- పరిశ్రమలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నిలయంగా యలమంచిలి నియోజకవర్గం



అచ్యుతాపురం : ఈ నియోజక వర్గం యలమంచిలి , రాంబిల్లి , మునగపాక ,అచ్యుతాపురం మండలాల పరిధిలో ఉంది. ఒక మున్సిపాలిటీ కూడా దీనిలో అంతర్భాగంగా ఉంది. యలమంచిలి నియోజక వర్గం 1952లో ఏర్పడింది. సముద్ర తీరాన ఉండే అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరంతో పాటు, యలమంచిలి మండలాలతో ఏర్పడింది. తర్వాత ఎస్.రాయవరం మండలం పాయకరావుపేటలో విలీనం అవ్వడంతో మునగపాక మండలం యలమంచిలి నియోజకవర్గంలోకి విలీనం అయ్యింది.మొట్టమొదటి ఎమ్మెల్యేగా కృషికార్ లోక్‌పార్టీ తరపున పప్పల బాపునాయుడు గెలిచారు. మొత్తం 15 పర్యాయాలు ఈ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికలు జరగగా, ఆరుసార్లు టీడీపీ, నాలుగుసార్లు కాంగ్రెస్, ఒకసారి వైఎస్సార్‌సీపీ, ఒకసారి కృషికార్ లోక్‌పార్టీ, మూడుసార్లు ఇండిపెండెంట్లు గెలిచారు. ఈ నియోజక వర్గం తరపున నాలుగుసార్లు టీడీపీ తరపున పప్పల చలపతిరావు గెలవగా, ప్రస్తుత ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు (కన్నబాబు) మూడుసార్లు గెలిచారు. నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉంది. రెండో స్థానం గవర సామాజిక వర్గం, తదుపరి వెలమ సామాజిక వర్గం ఉంటుంది. మత్స్యకార్ల ఓట్లు, యాదవ సామాజిక వర్గ ఓట్లు, ఎస్‌సీ సామాజిక వర్గ ఓట్లు కీలకం. మైనారిటీ ఓట్లు ఉన్నప్పటికీ క్షత్రియ వర్గానికి చెందిన వారు ఆరుసార్లు విజయం సాధించడం గమనార్హం. కొందరు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలోకి రావడంతో పోటీ అధికార పార్టీకి, టీడీపీ మధ్య తీవ్రత నెలకొంది. చింతలపాటి సూర్యనారాయణ రాజు, వీసం సన్యాసినాయుడు, నగిరెడ్డి సత్యనారాయణ, కేకేవీఎస్ రాజు, పంచకర్ల రమేష్ బాబు కూడా ఈ నియోజకవర్గం తరపున ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన వారే. ఈ నియోజకవర్గం తరపున మంత్రిగా పనిచేసే అవకాశం వీసం సన్యాసినాయుడుకి దక్కింది.

సామాజిక వర్గాల ప్రభావం

యలమంచిలి నియోజక వర్గం ప్రధానంగా ప్రభావితం చేసే కులాలు కాపు, వెలమ, గవర, క్షత్రియులు. అధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం, వెలమ సామాజిక వర్గాలు బలపరిచే అభ్యర్థులకే గెలుపు అవకాశాలు ఉంటాయి. సహజంగానే ఇక్కడ కాపు సామాజిక వర్గానికి, వెలమ సామాజిక వర్గానికి పోటీ ఉంటుంది. యలమంచిలి, మునగపాక మండలాల్లో అధికంగా ఉండే గవర సామాజిక వర్గ నేతల ఓట్లు కూడా కీలకమే. మరో వైపు మత్స్యకార గ్రామాలైన పూడిమడక, తంతడి ఓట్లు సైతం గెలుపోటములను నిర్ణయిస్తుంటాయి.

బలంగా అధికార పార్టీ...

గత ఎన్నికల్లో యలమంచిలి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ తరపున యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) తన సమీప టీడీపీ అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుపై 4146 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రస్తుతం నియోజక వర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు తర్వాత వైఎస్సార్‌సీపీలో చేరారు. మళ్లీ పార్టీ మారి ఇప్పుడు జనసేనలో ఉన్నారు. ఈయన నియోజక వర్గ పార్టీ కార్యకలాపాల నుంచి దూరంగా వెళ్లి విశాఖ సిటీలో స్థిరపడ్డారు. కాపు సామాజికవర్గ నేత సుందరపు విజయ్ కుమార్ ప్రస్తుతం జనసేన అభ్యర్థిగా బరిలో ఉన్నారు.


వైఎస్సార్‌సీపీ పరంగా ఎమ్మెల్యే కన్నబాబు రాజు, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, తులసీరావు కుమారుడు డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్, విశాఖ వెస్ట్ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గానూ వ్యవహరిస్తున్నారు. మునగపాక మండలానికి చెందిన బొడ్డేడ ప్రసాద్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా వ్యవహరించడంతో నియోజకవర్గంలో అధికార పార్టీ బలంగా ఉంది.


యు.వి.రమణమూర్తిరాజు (వైఎస్సార్‌సీపీ)


సుందరాపు విజయ్‌కుమార్ (జనసేన)

రాజకీయాలకు అతీతంగా విరివిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు మౌలిక వసతులు అభివృద్ధి చేయడంతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారు.

నియోజకవర్గం ప్రత్యేకతలు


పంచదార్ల ఉమా ధర్మ లింగేశ్వర ఆలయం

- సముద్ర తీర ప్రాంతానికి ఆనుకొని యలమంచిలి నియోజకవర్గం సెజ్ ప్రాంతంగా గుర్తించారు.
- పూడిమడక, తంతడి తీర ప్రాంతాలు సుందర దృశ్యాలతో కనిపిస్తాయి.
- తంతడిలో తరచూ సినిమా షూటింగ్‌లు జరుపుతున్నారు.
- అచ్యుతాపురం సెజ్‌లో అంతర్జాతీయ బ్రాండెడ్ కంపెనీలు ఉన్నాయి.
- కొండకర్ల–వాడ్రాపల్లి ఆవ ప్రముఖ పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతోంది.
- రాంబిల్లిలో పంచదార్ల పుణ్యక్షేత్రంలో భాగంగా నీటి జలధార నిరంతరం పారుతుంది.
- రాంబిల్లి మండలంలోని ఫణిగిరి కొండపై బౌద్ధ క్షేత్రానికి విశిష్టత ఉంది.
- యలమంచిలి మండలంలోని ఏటికొప్పాక లక్కబొమ్మల తయారీకి అంతర్జాతీయ స్థాయిలోనే గుర్తింపు ఉంది.
- వాడ్రాపల్లి దక్షిణ కాశీశ్వర ఆలయానికి ప్రత్యేక ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తింపు ఉంది.
- రాంబిల్లి మండలంలోని నేవల్ బేస్‌కు జాతీయ స్థాయిలోనే ప్రత్యేకత ఉంది.